



# మహిత

## సామాన్య

'బుజ్జమ్మా! ఒక రవ్వంత ఇది చదువు నాయన, కంటిచూపు ఆనటం లేద'ని నాయనమ్మ పిలిస్తే చదవదామని పోతా ఉండానా, అంతలోకి మా నాయనొచ్చి మొన్న చూసిపోయిన పెళ్లిచూపులోళ్ల గురించి చెప్పడం మొదలుబెట్టేడు.

ముందుగా మీకు నా గురించి చెప్పనీయండి. నా పేరు మహిత. ఆ పేరు మా అత్త ఏదో పుస్తకంలో చదివి పెట్టిందంట. మహిత అంటే 'గొప్పది' అంట.. మా అత్త కూతురు చెప్పింది. నాకిప్పుడు పదహారేళ్లు. మొన్ననే నా పదో తరగతి రిజల్ట్స్ తెలిశాయి. నేను లెక్కల్లో, సైన్సులో ఫెయిలయ్యాను. అందరికీ ముందుగానే తెలుసు కాబట్టి నన్నెవరూ తిట్టలేదు. అదీకాక ఒకేళ పాసయినా మా ఊరి నుండి టౌనుకు పోయి చదవడం మా నాయనకు రొవ్వంత కూడా ఇష్టంలేదు. ఎందుకంటే ఇప్పుడసలే కాలం బాలేదు కదా, ఏమయినా అయితేనో... దారిలో ఎవడైనా నన్ను ఏమైనా చేస్తేనో అని మా నాన్నకి భలే భయం.

సైగ్గా మీకో విషయం జెప్పాలి, అదేంటంటే... నేను నిజంగానే అందంగా ఉంటా. పదో తరగతికి వచ్చాక రవనారెడ్డోళ్ల పెద్దకొడుకు నా క్లాసులోనే చిన్నప్పట్నించి చదవతా వుండాడా, ఇప్పుడేమో నా పక్క అదొక రకంగా చూట్టం మొదలుబెట్టేడు. వాడట్ట చూడ్డం నాకేం బాగుండదు. కానీ ఎంతైనా నేను అందమైనదాన్ని కాబట్టే కదా అట్టా చూస్తా వుండాడు. నా పక్కన కూర్చునే ప్రసూనని చూస్తా వుండాడా? చూట్టం లేదు కదా! అనిపిస్తది. నాకు సన్నటి నడుము, నడుంపై నడిచే జడ ఉన్నాయి.. జడంటే మామూలు జడ కాదు. ఈంత లావు, ఈంత పొడుగు జడ నాది... నా జడ చూసి మా అత్తలు మహితకి జుట్టు మాదొచ్చింది అంటారా, మా అమ్మేమో చాటుగా, ఏది బాగుంటే అదంతా వీళ్ల పోలికలే అని తిట్టుకుంటది. కానీ నిజంగా నా జడ మా అత్తల పోలికే. అంత పొడుగు జడకి కుచ్చులు పెట్టుకుని ఎప్పుడైనా పైటా, పావడా వేసుకుంటే భలే బాగుంటా.

పదారేళ్లకే పెళ్లేందని మా అత్త కూతురు మా నాయన దగ్గర నసపెడతా ఉంటదిగానీ, నాకు మాత్రం పెళ్లంటే ఇష్టమే. చదవడం, పరీక్షలు రాయడం నాకేం ఇష్టంగా అనిపించవు. మా ఇంట్లో ఆ పక్క వొస్తువు ఈ పక్కకి, ఈ పక్క వొస్తువు ఆ పక్కకి జరిపినా మా అమ్మ 'నీ ఇంటికి పోయిన పాట నీ ఇష్టప్రకారం చేసుకుందువులేగాని ఇప్పటుకి అట్ట ఉండనియ్యమ్మా,' అంటది. ఆ మాట ఇని ఇని నాగ్గూడా పెళ్లి చేసుకుంటే బాగానే ఉంటది అనిపిచ్చింది. అప్పుడు చామంచి పూలతొట్లు నాకిష్టమైన చోట పెట్టగలనుకదా అని నా ఉద్దేశం. బాగా పూసిన పూలతొట్టిని ఎవరైనా జనాలకి కనిపిచ్చకుండా పెట్టుకుంటారా? మా అమ్మకి చెప్పినా అర్థం కాదు. వచ్చేపోయే దారికి అడ్డమంటది. నాకోసం రోజా వచ్చే కుంటికాకికి అంటే కూడా అమ్మకి ఇష్టమే ఉండదు. 'ఎందుకుమే దాన్ని పోతును మేపినట్టు మేపతా ఉంటా' వంటది. 'పాపం అది కుంటిది కదా, మళ్లీ అక్కడా ఇక్కడా తిరగడమెందుకు, మనమే పెడదాం మా,' అని చెప్పినా మా అమ్మకి అర్థమేకాదు. తరిమి పారేస్తది. మళ్లీ అమ్మ ఎంత మంచిదో...! మొన్నా మధ్య ఇంటి బయటికి వచ్చినానో లేదో తలాకిటి యాపచెట్టు పై నుండి పామొకటి నా మెడలో పడిందా, నేను గబాల్న

ఇదలగొట్టేశానా. అదంతా అయిపోయి గంటయినా మా అమ్మ యాడస్తానే ఉణ్ణింది. నా వళ్లంతా తడిమి ఎక్కడైనా పాము కాటు ఉందేమోనని చూసుకుంటానె ఉణ్ణింది. నా చేత పచ్చి మిరపకాయ కూడా నవిలిచ్చింది. నాకేమవలేదమ్మా అంటా ఉంటే ఇనిపిచ్చుకున్నదా! అబ్బే ఒకటే ఏడుపు. అన్నట్టు నా పెళ్లయి నేను వేరే ఊరికి ఎళిపోతే ఈ కుంటికాకి నన్ను ఎతుక్కుంటదా? అమ్మ దీనికేమయినా పెడతదో లేదో. పెడతదిలే... మా అమ్మ పైకి కనిపిచ్చేంత కటినం కాదు. అయినా ఇది నాతో వచ్చేస్తే బాగుంటది కదా!

మా అమ్మ యేమంటదంటే, మా నాయన ఏడు మున్నోరు కాలం చేనుకి చాకిరి చేస్తానే ఉంటాడంట గానీ, అదేం మాయో అంతెత్తున కనిపించే పంట కూడా చేతికొచ్చేసరికి చిటికంత, నోటికొచ్చేసరికి నలుసంత అయిపోతదంట. 'ఏదో ఒకటి అమ్మకపోతే అమ్మి పెళ్లి జెయ్యడం ఎట్ట కుదరద్ది...' అని నేను ఎనిమిదో తరగతిలోకి వొచ్చినప్పటి నుండి మా అమ్మ అదేపనిగా కయ్యను అమ్మెయ్‌మని మా నాయన దగ్గర నస మొదలుబెట్టింది. మా నాయన మా అమ్మ మాటలకి 'ఊ' అనో 'ఆ' అనో అనకుండానే నేను పదో తరగతి ఫెయిలు కూడా అయిపోయా. మొన్నొచ్చిన సమ్మంధం ఇప్పటికి నాలుగోది. వచ్చినోళ్లందరూ పిల్ల బాగుందంటారా... వాళ్ల ఆడోళ్లు లేసొచ్చి నా జడ పట్టుకుని అసల్దా సవరమా అని పరీక్షలు కూడా చేసుకుంటారా... పిల్ల మంచి పనిమంతురాలని మా అమ్మ చెప్పద్దా... చీరల మీద కుట్లు కుడతానని, బుట్టలుగూడా అల్లతానని మా అత్తలు చెప్తారా... వొచ్చినోళ్లు పెట్టింది తిని, నచ్చినట్టు తలలూపతారా... ఆ తరువాత వాళ్లతో వచ్చిన పెద్ద మనుషుల్లో ఎవడో ఒకడు మొదలుపెడతాడు- 'అయ్యంతా సరేలే ముందు పెట్టుపోతల సంగతి చెప్పండి,' అని. ఇంకంతే మొత్తమంతా నసనసగా అయిపోతది. మా వోళ్లు చెప్పింది ఇని కొందరేమో, 'ఆ కట్నానికి మాకు కుదరదులే,' అని మొహం మీదే అంటారా, కొందరేమో, 'తర్వాత చెప్తాం,' అని పొయ్యి ఇంక ఆ మాటే మాట్లాడరు. వాళ్లు అట్ట పోంగానే ఇంక మా యమ్మ మా నాయనతో తగువులాడతది.

ఇది ఇట్ట జరగతా ఉండంగా ఒకరోజు మా అమ్మకి వాళ్ల దూరపు చుట్టాలెవరో ఒక సమ్మంధం గురించి చెప్పేరు. ఒకడే కొడుకంట, ముగ్గురు అప్పజెల్లెళ్లు, ముగ్గురికీ పెళ్లిళ్లయిపొయినాయంట. మంచి కుటుంబం, ఇల్లూ వాకిలీ కయ్యా గాల్వా బలంగా వుండాయని చెప్పుకొచ్చేరు. వాళ్లు చెప్పేప్పుడు నేను పక్కనే అన్నీ ఇంటా ఉండాగదా, అప్పుడు మా అమ్మ వాళ్ల మాటలకి తలూపి, 'అయ్యంతా సరేలే! అంత ఆస్తి ఉంటె, మనమిచ్చే కట్నానికి వాళ్లు మనల్నెందుకు చేసుకుంటారని గదా,' అన్నది. దానికి వాళ్లు, 'ఆస్తి ముఖ్యం కాదు, పిల్ల అందంగా ఉండాలంట వాళ్లకి, మీరు నలుగుర్లో గనంగా కనిపిచ్చేట్టు మీ పిల్లకి నగలూ గిగలూ పెట్టుకోండి, వాళ్ల తాహతుకు తగ్గట్టు పెళ్లి బాగా చెయ్యండి చాలు. మీ అమ్మి జీవితం సుఖంగా వుంటది. మీరింక దేనికీ దిగులు పడబళ్లేదు. మీరెప్పుడంటే అప్పుడు పెళ్లిచూపులు పెట్టుకుందాం,' అన్నారు. అందుకు మా అమ్మ మా రెడ్డినడిగి ఏ విషయం చెప్తాలే అన్నది.

ఆ సమ్మంధం విషయం ఆ రోజే మా నాయనకి చెప్పింది మా అమ్మ. అంతా ఇని, 'అమేయ్ వాళ్లు అడిగినా అడక్కపోయినా మనం మన అమ్మికి పెట్టుకోవాల్సింది ఎట్టయినా పెట్టాల్సిందే కదా? పెట్టడానికి ఇప్పుడు మన చేతుల్లో చిల్లిగవ్వలేదు. ఏదో ఒకటి అమ్మితే తప్ప చెయ్యాడే వొసతి లేదు. అందుకని చేసే కాడ మంచీ చెడ్డ ఇచారిచ్చుకుని చేద్దాం. తొందరపడబాక,' అన్నాడు మా నాయన. అయితే ఆ పై వారానికి మళ్లీ వొచ్చేరు వాళ్లు. మా అమ్మ సందె కసువు చిమ్మతా ఉణ్ణింది, వాళ్లని చూసి చీపరకట్ట నాకిచ్చి, 'ఒక్కరవ్వంత నీళ్లు చల్లి ముక్కారెయ్యమ్మా,' అంటా, మంచం వాల్చి వాళ్లని కూర్చోపెట్టింది. అప్పుడు మా నాయన కూడా ఇంట్లోనే ఉణ్ణేడు. వచ్చినవాళ్లు అంతకముందు మా అమ్మకి చెప్పిన మాటలె మా నాయనకి గూడా చెప్పేరు. మా నాయన అంతా ఇని, "అట్టేలే ఒకసారి ఆ ఊరికిబొయ్ చూసుకొద్దాం. ముందూ ఎనకా ఇచారిచ్చాలి గదా,' అన్నాడు. వచ్చినవాళ్లు మా నాయనకి ఎంతో మేలుజేస్తా వుణ్ణెట్టు, 'లేటు చెయ్యబాక బావా, మంచి సమ్మంధం చేయి దాటిపోతది. పై శుక్రవారం మంచిరోజు. ఆ రోజు వాళ్లని పిలుద్దాం. అన్నీ కుదర్తా ఉండాయనుకుంటే అప్పుడు వాళ్ల ఊరికి బొయ్యి ఇచారిచ్చుకుందువుగాని,' అన్నారు. మా నాయన, 'సరేలే అమ్మా. అట్టేలే!' అన్నాడు.

## 2

పెళ్లోళ్లు శుక్రవారం సాయంత్రం మూడుగంటలకి వస్తామని చెప్పేరు. కాని వాకిటి ముందు వాళ్లు కారు దిగేప్పటికి ఐదయ్యింది. మా ఊరి సూర్యుడు దూరంగా కనిపిచ్చే సవక తోపుల్లోకి జారబోతావుండాడు.

నాకు మా అత్తలు కుచ్చులు పెట్టి జడ గట్టిగా బిగిచ్చి ఏసి నాలుగైదు మూర్ల కదంబంపూలు పెట్టారు. ఈమధ్య కాలంలో పెళ్లి చూపులకని తీసిపెట్టిన చీర కాకుండా వేరే చీర కట్టబెట్టేరు. ఎందుకంటె ఆ చీర కలిసి రావడంలేదంట మా పెద్దత్త చెప్పింది. 'పెళ్లి కొడుకుని చూసుకోమేయ్ సిగ్గుపడబాక,' అని చెప్పి పంపిచ్చేరుగానీ నేను చూడలా. నాకేం సిగ్గులేదుగానీ ఎందుకనో తలెత్తలేకపోయా. ఈసారి పెట్టినయ్ తింటా వాళ్లు పిల్ల నచ్చింది అని చెప్పేశారు. అబ్బాయి అక్క ఇంతకుమునుపు పెళ్లిచూపుల వాళ్లలాగే నా దగ్గరకొచ్చి కూచుని నా జడ నిజమా కాదా అని పరిశీలిచ్చింది. పెద్దోళ్లు ముహూర్తాల గురించి మాట్లాడుకుంటా వుండారు.

నేను వాళ్లకి నచ్చడం చూసి నాయన సంతోష పడ్డాడు. కానీ, బాబాయి మాత్రం, 'ఒమేయ్ మహిత, ఆ పిల్లోడికి ఒక రవ్వంత పళ్లెత్తుగా ఉండాయి, చూసుకో మంటే చూసుకోకపోతివి నచ్చలేదనిపిస్తే ఇప్పుడే చెప్పేయ్ మే, బదనాయమేమీ లేదు,' అన్నాడు. నేను, 'నాయన ఏది చెప్తే అదే బాబాయ్,' అన్నా. మా బాబాయ్, 'అవున్లే రేపు కాపరం జేసేది మీ నాయనై పాయ, నాయన యేది జెప్తే అదంట,' అని నవ్వేడు.

అట్ట మాఘమాసం పద్నాలుగో తేదీ నా పెళ్లైపో యింది. పెళ్లిచూపులకి పెళ్లికి మధ్య పెద్ద తేడా కూడా లేదు. మధ్యలో మా నాయన ఒకసారి పిల్లోడింటికి పొయ్యొద్దామని మధ్యవర్తులతో అంటే, 'ఇచారిచ్చేదేమీ లేదు ఏణురెడ్డా మాదీ పూచీ,' అన్నారు. అయినా మా నాయన ఆ ఊరికి పొయ్యి వాళ్లకి పన్నెండెకరాల మాగాణి, పద్నాలుగెకరాల మెట్ట ఉందని, ఇళ్లు చేల మధ్య ఒక రొంత ఊరి చివరగా ఉంటదని, సౌకర్యం గానే ఉంటదని తెలుసుకొచ్చాడు.

మా కొనగట్ట చేను అమ్మి ఆ డబ్బుతో మా నాయన నాకు మెడనిండా నగలు చేయిచ్చేడు. చీరలు సారెలు తీసిచ్చేడు. ఘనంగా పెళ్లి చేసేడు. నా పెళ్లి అంత ఘనంగా అవతదని నేనెప్పుడూ కల్లో గూడా తల వలా. నా సావాసగత్తెలూ అదే మాట అన్నారు. దీనికంత టికీ కారణం పెళ్లికొడుకు కట్నం తీసుకోకపోవటమేనని తేల్చారు. ఐనా నాయన కట్నం డబ్బుకి బదులుగా నా పేరు మీద రొవంత కయ్య రాసిచ్చేడు.

ఆ రోజు మనుగడుపులు. మా పడమటింట్లో పక్క ఏర్పాటు చేశారు. నాకు మల్లెపూల జడేసి పాలు చేతికిచ్చి ఇంట్లోకి పంపారు. ఎళ్లి చూద్దును గదా మా ఆయన సుబ్బరంగా గోడపక్కకి తిరిగి పొడుకొని కని పించాడు. ఉలుకూ లేదు పలుకూ లేదు. అసలు దీని గురించి అందరు ఏందేందో చెప్తారు కదా, పైగా అంతకు రెండు గంటల ముందర నుంచి నన్ను కూచో బెట్టి అయి గట్టి ఇయ్ పెట్టి పంపిచ్చేరు కదా అందుకని పెళ్లికొడుకుని చూడగానే నాకు ఒక రవ్వంత ఇచిత్ర మేసింది. కానీ రొంతసేపటికి నాక్కూడా బాగా నిదరొచ్చి నిదరపొయ్యా. అట్టా మూడు రోజులు గడిసి పొయ్యాయి. ఏం జరిగిందని మా అమ్మ అడగలాగానీ ఆళ్లూ ఈళ్లూ అడిగారు. ఏం జరిగిందో జరగలేదో, చెప్పొచ్చో లేదో అర్థంకాక నేను మాట్టాడకపోయినా కొందరు పెద్దోళ్లు ఏం జరగలేదని కనిపెట్టేసి, 'పిల్ల చిన్నది కదా ఆ యబ్బయ్య బయపడి ఉంటాడ్లే,' అన్నారు.

ఇంకొన్ని రోజులకి నేను వాళ్ల ఊరికి బయల్దేరా. ఆరుగురు కూర్చోవాల్సిన కార్లో పన్నెండు మందిమి కూర్చున్నామా ఒకటే ఉమ్మదం. వాళ్ల ఊరికి చేరేసరికి మద్యానం రెండయింది. ఇల్లు మా నాయన చెప్పినట్లు బాగానే ఉంది కాని బయటికి మాత్రమే బాగుంది, లోపల చీకటి గుయ్యారం. ఆ ఇంటి ఎనకమాల ఇంకో ఇల్లుంది. ఆ తరువాత అంతా అడివే.

నాతోపాటు వొచ్చినోళ్లందరూ ఒకట్రెండు రోజు లుండి ఎళిపొయినారు. కడాన మా అమ్మ బయల్దే రింది. మా అమ్మ పోతావుంటే మటుకు నాకు బాగా ఏడుపొచ్చింది. పెళ్లయితే చామంచి పూలతోట్లు నా ఇష్ట మొచ్చినట్లు పెట్టుకోవచ్చనుకున్నాగానీ మా అమ్మ లేకుండా ఉండటమెట్టా అని ఒక్కరోజైనా ఆలోచిచ్చ లేదని అప్పుడు తెలిసింది. ఆ చీకటింట్లో నాకు ఒక రొంత భయమేసింది. ఏడస్తా వుంటే నన్ను ఇదిలిచ్చు కోని మా అమ్మ, "అమ్మిని బాగా చూసుకో అమ్మ. ఇంక అండెన దండెన అంతా నీదే,' అని మా అత్తతో చెప్పి ఎనక్కి తిరిగి చూడకుండా కళ్లనీళ్లు పెట్టుకుంటా ఎళ్లి పోయింది.

పెళ్లయిన తరువాత మా వాళ్లంతా అనటం మొదలుపెట్టారు మహిత అత్తగారు బలేగుంది లేస్తే కూచోలేదు కూచుంటే లేవలేదని. మా అత్త అంత లావు. ఇంతకాలం ఈ ఇంటి పనంతా ఎట్ట జేసుకుందో నాకు ఒక్క రొంత కూడా అర్థం కాలేదు. కూచున్న కాడ్నించి లేవకుండా కళ్లు నా మీదేసి మా అత్త, నేను చేసిన ప్రతి పనికీ వంకలు పెడతా ఉంటది. ఎట్టంటే ఈ రోజు కాఫీ గిన్నె ఇక్కడ దబ్బిళిచ్చు అంటదా రేపు మనం ఆడే

దబ్బిళిచ్చినా ఇంకొకచోట చూపిచ్చి, 'నిన్ననే గదమే చెప్పింది నీకా, అప్పుడే మరిచిపోయా, ఇప్పుడే ఇంత మతిమరుపుంటే ఆయ పాయవొచ్చాక ఇంకెట్ట జేస్తావో...' అంటది. మతిమరుపు నీకే అత్తా అని మన మెట్ట చెప్తాం. అత్త ఏమన్నా నోరు తెరవబాక అని మా అమ్మ నాకు ముందే చెప్పింది కదా!

మా అమ్మ ఎళిపోయిన మూడు రోజులకి మా ఆయన ఇంటికొచ్చాడు. మా ఆయనకి రొయ్యల ఫీడు అమ్మే యాపారం ఉంది. దానికోసమో ఏమో ఏదో పని మీద గూడూరుకి పొయ్యాడని మా అత్త చెప్పింది. కానీ పోతా పోతా ఆయన నాకేం చెప్పిపోలా. గూడూరు కాడే మా నడిపి ఆడబిడ్డ ఉంటది.

పొద్దుగూకే యాళకి ఇంటికొచ్చాడా మా ఆయన, సరే అన్జెప్పి ఉడుకుడుగ్గా నీళ్లు కాసిచ్చి దొడ్లో పెట్టి, తుండుగుడ్డ అందిచ్చా. ఒచ్చిన కాడ్నించీ ఆయన నాతో ఒక్కమాటైనా మాట్లాడలా. అన్నం తినేకాడా మాట్లాడలా. అసలు పెళ్లైన కాడ్నించి ఆయన నాతో మాట్లాడిన మాటలు యాళ్ల మీద లెక్కబెట్టొచ్చు. ఆయన తిని లేసిన తరువాత మా అత్తకి బెట్టి నేనూ తిన్నా. ఆ చీక టింట్లో ఐదు రూములుంటాయి. మూడో రూము మా ఆయన పొడుకునేది. నేను ఆడే పొడుకోవాలని నాకు తెలుసుకదా అందుకని ఆ రూములోకి పొయ్యా. మా ఆయన మంచం మీద పొణుకోనున్నాడు. నేను పోగానే గెడి పెట్టి ఇట్రా అన్నాడు. నాకు బలే సిగ్గేసింది. ఐనా మా ఆయనకాడికి పొయ్యి నిలబడ్డా. ఆయన ఒక్క మాటన్నా మాట్లాడలా. అమన్నే నా రొమ్ముల మీద చెయ్యేశాడు. నాకు రొమ్ములు కొంచెం పెరగడం మొదలవగానే మా అమ్మ చేత నీళ్లు పోయించుకోడం సిగ్గేసేది. నేనే సొంతంగా తలకి కూడా పోసుకునేదాన్ని. అటువంటిది ఎంత మొగుడైనా అట్టా చెయ్యేసేసరికి నేను గట్టిగా రైకని పట్టేసుకుని గింజుకోడం మొదలు పెట్టా. మా ఆయన అటు గుంజుడు నేను ఇటు గుంజుడు. ఇంతలో ఏమయిందో ఒక సిటంలో నా చెంప పేలిపోయింది. నా చేతులు చెంప మీదకి పొయ్యాయి. నేను మంచం మీద పడ్డా. ఆ తరువాత ఏం జరిగిందో నాకేం అర్థం కాలా. అరవబొయ్యా. 'నోరు ముయ్' అంటా నా చెంప మళ్లీ పగిలింది. పొద్దుటకి నాకు వొళ్లు ఎచ్చబడి లేవబుద్ధి కాలా. ఆయన పొద్దన్నే లేచి ఎట్టబొయ్యాడో తెలీదు. నాకు కనిపిచ్చలా.

ఎట్టో ఒకట్ట లేసి పనంతా జేసి పైటేళ బంతి చెట్ల కాడ పీటేసుకుని కూర్చున్నా. పక్కన చేను మీంచి సల్లటి గాలీస్తా ఉంది. మా అమ్మ గుర్తొచ్చింది, నా కుంటి కాకి గుర్తొచ్చింది. చుట్టుపక్కలోళ్లు గుర్తొచ్చారు. ఏడుపొచ్చింది. రాత్రి జరిగిందంతా మళ్లా గుర్తొచ్చింది. మా పెద్దమ్మ, వాళ్ల మనవరాలికి ఐదేళ్లయినా ఎందుకో చెవులు కుట్టిచ్చలా. బుడ్డిది అందరి చెవులూ పట్టుకుని నాగ్గూడా కమ్మలు కావాల అంటా ఉండేది. నేను కమ్మలు కావాలంటే చెవులు కుట్టిచ్చుకోవాల అని చెప్తా ఉండేదాన్ని. అది ఒకసారి అడిగింది. చెవులు కుట్టిచ్చుకోడం అంటే ఏంది పిన్నీ అని, అప్పుడు గోడకి శీల కొట్టడం చూపిచ్చి, 'అదిగో అదీ చెవులు కుట్టిచ్చుకోడం అంటే,' అని చెప్పా. ఆ తరువాత కంసాలి తాత దానికి చెవులు కుట్టాడా... అంతా సద్దుమణిగిన తరవాత అది అడిగింది, 'పిన్నీ చెవులు కుట్టిచ్చుకోడం అంటే ఇదా,' అని. నాకెందుకో ఇప్పుడదే జ్ఞాపకమొచ్చింది. రొమ్ముల చుట్టూతా పళ్లగాట్లే. పెళ్లంటే ఇదే అయితే అందరూ ఎందుకు పెళ్లి చేసుకుంటా ఉణ్ణట్టు? పెళ్లంటే ఇద య్యుండదని నాకనిపిచ్చింది. అమ్మతో చెప్దామని పిచ్చింది కానీ ఎట్ట చెప్పడమని సిగ్గేసింది.

ఆ రోజు పోయినోడు మా ఆయన తర్వాత వారానికొచ్చేడు. నాకు రొమ్ముకు పడ్డ పళ్లగాట్లు కొంచెం చెక్కు కడతా ఉండాయా... మా ఆయన్ను చూడగానే ఘోరంగా భయమేసింది. తప్పిచ్చుకోని తప్పిచ్చుకోని తిరగతా ఉంటే మా అత్త, 'సాల్లే సాల్లే నీ సింగినాదపు సిగ్గులు. వాడికేం గావాలో వైనంగా చూడు,' అన్నది.

మా ఆయన అన్నందిని ఊళ్లోకి పొయ్యేడు. మా మావ చేలోకి పొయ్యేడు. రాత్రవతా ఉందంటేనే నాకు మనసులో భయం పుడతా ఉంది. సంది కసువు జిమ్మి ముక్కల్రేసి బయట పొయ్యి రాజేసి నీళ్ల దబర పెట్టా. మా అత్త వాకిట్లో కుర్చీ ఏసుకుని కూర్చున్నది. ఏడున్నరకి మా ఆయన ఇంటికొచ్చేడు. నేను పీట వాల్చి అబ్బా కొడుకులకి అన్నంబెట్టా. ఏం జేస్తా ఉణ్ణే, నా గుండె దడదడమంటా నాకే ఇనిపిచ్చేట్టు కొట్టుకుంటా ఉంది. ఎందుకొచ్చిందోగానీ మాటమీద మాటొచ్చి వాళ్ల ముగ్గురి మధ్య పెద్ద తగువయింది. నాకు ఇంకా ఎక్కువ భయం పుట్టింది.

వంటింట్లో అయ్యి సర్ది ఇయ్యి సర్ది నిదానంగా మా ఆయన రూములోకి పొయ్యా. ఆయన నిద్దరపోతా ఉండాడు. నాకు బలే సంబరమేసింది అబ్బా ఈ రోజుటికి బాధ తప్పింది అని. శబ్దం కాకుండా ఒక మూలగా చాపేసుకుని పడుకున్నా. పడుకున్నానేగానీ మనసులో భయం. ఈరోజైతే సరే రేపెట్టా?... పోనీ అమ్మకు చెప్తేనో? ఆలోచిస్తా ఉంటే నిదరపట్టింది.

ఒక రాతిరికాడ ఏదో కుట్టినట్టు సుర్రుమంటే అబ్బా అని లేసి కూచ్చున్నా. ఎదురుగా మా ఆయన. నా చీర తొడలకాడికి జరిగిపోయుంది... నిదర మత్తులో ఏమీ అర్థంకాలా. ఒకటే మంట.. వణుకొచ్చేసింది. పటపటా కళ్లనీళ్లు రాలినయి. తలెత్తి మా ఆయన్ని చూసే లోపల ఇంకోసారి అదే పని జరిగింది. ఆ రోజు మా ఆయనేం చేసేడో నేను మీకు నోరు తెరిసి చెప్ప లేను. మా ఆయన చేతిని తోసేసే లోపల నా చెంప పేలిపోయింది. 'నిదరబొయినాడు కదా ఈ రాత్రికి సుఖంగా పడుకుందామనుకున్నా,' అన్నాడు. కళ్ల నీళ్లు తెరిపి లేకుండా కారిపోతా ఉండాయి. ఆగకుండా ఎక్కిళ్లు వస్తా ఉండాయి. ఎక్కిళ్ల మధ్య గొంతు పెగుల్చు కుని, 'నేనేం తప్పు చేసినాను, నేను మా ఇంటికెలిపోతా,' అన్నా. ఆ మాటకి ఇంకోసారి చెంపలు పగలగొట్టి కాల్తో తొడలు తొక్కి పోయి మంచమెక్కాడు. నేనంత అరస్తా వున్నా, మా అత్తా మావా లేసి రాలా. నాకు గజగజ వణు కొచ్చింది, ఇటువంటి మనుషులు కూడా ఉంటారా అనిపిచ్చింది.

పొద్దటికి భగభగమని మండిపోతా జరమొచ్చే సింది. మా అత్త వచ్చి చూసి, 'ఇదేం చోద్యమో చీటికి మాటికి జరమని మంచమెక్కద్ది. వొచ్చిందమ్మ భలే కోడలా,' అన్నది.

ఆ రోజు సాయంత్రం మా అత్త పెట్టిపోయిన కాఫీ కొన్ని గుక్కలు తాగి, దొడ్లోకని చెప్పి బయటకొచ్చా. మా ఇంటికి నాలుగిళ్లవతల వాళ్లింట్లో ఫోనుందని మా అత్త ఒకసారి ఎవరికో చెప్తా ఉంటే ఇన్నా. దొడ్డిదారిన వాళ్లిం టికి పొయ్యి ఒకసారి ఫోన్ చేసుకోవచ్చా అని అడిగా. నా అవతారం చూసి ఏమనుకున్నారో చేసుకోమ్మా అన్నారు.

అవతల మా నాయన ఫోనెత్తాడు. నాకు ఇంక ఏడుపు ఆగలా. ఒకటే ఏడుపు, ఎక్కిళ్లు, ఆ ఎక్కిళ్ల మధ్యే అంతా చెప్పా. ఈసారి సిగ్గెయ్‌లా. అవతల మా నాయన గొంతు వజవజా వొణికిపోయింది. 'ఇదిగో నాయన నేనీ బస్సుకే బయల్దేరతా ఉండా, బయపడ బాక, ఆ పెళ్లీ వొద్దు, పెటాకులూ వొద్దు. ఇంక ఆ ఇంటికి పోబాక ఊర్లో ఏదన్నా గుడో బడో ఉంటే కూర్చో తల్లా మా అమ్మా... వొచ్చేస్తా ఉండా,' అన్నాడు. నేను మా నాయన జెప్పినట్టే ముత్యాలమ్మగుడిలో కూచున్నా. మా ఊరి నుండి ఈ ఊరికి రావడానికి సమయానికి బస్సు చిక్కితే నాలుగ్గంటలు ప్రయాణం. ఒకేళ బస్సు దొరక్కపోతేనో? అంత లోపలే ఈళ్లు నన్ను జూసే స్తానో?? మళ్లీ వొణుకొచ్చింది!

కానీ మా నాయన బస్సులో రాలా, కారు బాడుక్కి తీసుకుని వచ్చాడు. గుడి కాడ ఆగాడు. కార్లో మా చిన్నాయన, అత్త ఇంకా ఎవరో ఉండారు. నేను మా నాయన పక్కన కూర్చొని మా అత్త వొళ్లో తల పెట్టుకున్నా. వొకరొంత దూరంలోనే కారాగితే తలెత్తి చూసా మా అత్తోళ్లిల్లు. నాకేం అర్థంకాలా. అందరూ కార్లోంచి దిగారు. నేను మాత్రం దిగలా, పెద్దపెద్దగా అరుపులు, అంతా గోలగోలగా ఉంది. చుట్టుపక్కల ఇళ్ల వాళ్లంతా వచ్చి గుంపు కట్టారు. కొంతమంది కార్లోకి తొంగి చూడడం మొదలుపెట్టేరు. నేను తలొంచుకుని కళ్లు మూసుకున్నా. రొంతసేపటికి అందరూ కారెక్కారు. మేం మా ఊరికి బయలుదేరినాం.

### 3

ఏమైనా మా ఊరికొస్తా వుంటే నాకు సంతోషంగా ఉణ్ణింది. పొంగానే మా యమ్మ, 'నాయమ్మే నా మహితే,' అంటా, ఏడవటం మొదలుపెట్టింది. మా ఇల్లు చూసేసరికి నాకు చానా ధైర్యమొచ్చింది. అందు కని, 'యాడవబాకు మా,' అని మా అమ్మని నేనే ఓదార్చా. ఇంకేముందిలే అబ్బా వొచ్చేసాం అని ప్రాణా నికి హాయిగా అనిపిచ్చింది.

పొద్దున్నే నా కుంటి కాకిని చూడగానే ఎంత కుశాలుగా అనిపిచ్చిందో. సుబ్బరంగా తలకి పోసుకుని మా అమ్మ ఇచ్చిన మాత్తర్లు మింగి కుంటి కాకికి అన్నం పెట్టి యాపచెట్టు కింద మంచమేసుకుని కూచున్నా. సంగతి తెలిసిన చుట్టుపక్కలోళ్లు వచ్చి అమ్మని, నాయన్ని ఇచారిస్తా ఉండారు. అమ్మ ఎవరొస్తే వాళ్ల దగ్గర యాడస్తా ఉంది. నాకు మాత్రం ఏడుపు రాలా. మధ్యానం సల్లగా తాటికాయలు తింటా ఉంటే నవ్వు కూడా వచ్చింది. మా చిన్నాయన కూతురూ నేనూ ఏందేందో చెప్పుకుని ఒకటే నవ్వుకున్నాం. అయితే ఒకటి మాత్రం నిజం. నేను ఇంతకుముందు మహితను మాత్రం కాదు. ఇప్పుడు వేరే. ఎందుకు వేరే అని అడిగితే చెప్పలేను. మా నాయన ఎందుకమ్మా ఆ చీరలు సుబ్బ రంగా డ్రెస్సులేసుకోమ్మా అన్నాడు. నేను సరే అని డ్రెస్సు లేసుకోవడం మొదలుపెట్టా. తరవాత సంగతి ఏంది అని మా నాయన, అమ్మ ఎప్పుడూ మాట్లాడుకున్నట్టు నేను ఇన్లా.

నేనొచ్చేసిన నెలకి గావాల మా ఆయనోళ్ల ఊరి నుండి ఎవరో వచ్చారు. నేను తంపటేసిన గెణుసు గెడ్డలు తింటా యాపచెట్టు కింద కూర్చొని ఆయాల్టి పేపర్లు చూసుకుంటా ఉన్నా. మా యమ్మొచ్చి అమేయ్

మహిలు ఒక రొంత లోపలికి పో నాయన, మీ రెడ్డోళ్ల ఊరి నుండి ఎవరో వచ్చినారు అన్నది. నేను ఇంట్లోకి పోయి బయట మాటలు శుద్ధంగా ఇనిపిచ్చే కాడ కూచున్నా. వచ్చినోళ్లు, 'అయిందేందో అయింది పిల్లని పంపండి. ఈసారి అట్ట జరగకుండా చూసే పూచీ మాది,' అంటా ఉండారు.

మా నాయన ఇని, 'మీ బిడ్డనైతే మీరు ఇట్టనే అంటారా అయ్యా, సరే మీరేమనుకుంటారో నాకు అనవసరం. నేను మాత్తరం నా బిడ్డని పంపిచ్చే ప్రసక్తే లేదు. ఆ గుడిసేటి నా కొడుక్కి పెళ్లయి ఒక బిడ్డ కూడా ఉందంట. నాకు ఇంతకుముందే పెళ్లయ్యింది, ఈ పెళ్లొద్దని అమ్మా అబ్బలని ఒప్పిచ్చుకోలేని ఎదవ, నా బిడ్డని హింసబెడతాడా? సంసారం చేసే తీరేనా అది? నరికి పోగులుబెడ్తాం కొడుకుని. వచ్చిన దారినే పాయ్ రాండి,' అని లేసి తుండుగుడ్డ ఇదిలిచ్చి భుజానేసుకుని ఆడ్నించి యెళిపొయినాడు.

వచ్చినోళ్లు మా అమ్మని జూసి, 'నువ్వన్న చెప్పరా దంటమ్మ, ఆడపిల్ల బతుకు అన్యాయమైపోతది, ఎవరి కుండవూ అటమంటి యవారాలు, బిడ్డో గిడ్డో ఉంటే మనకేంది, దాన్నేమన్నా తీసుకొచ్చి ఇంట్లో పెట్టబోతాడా, ఉంచుకున్నది ఇంటిదవద్దా? మంచి కాపరాన్ని కూలదోసుకోవడం ఎందుకు,' అన్నారు. మా అమ్మ బొలబొలామని ఏడ్చి, 'అన్నా ఇంత బిడ్డని అంత బిడ్డని జేసుకున్నది వాడిచేత తన్నిచ్చడానికంటనా... మా బిడ్డ బతుకు అన్యాయం అయితే మాన్లే మా బిడ్డ మాకాడే ఉంటది మేం గా మా అమ్మిని అంపిచ్చం. వొచ్చినోళ్లెట్టా వొచ్చారు పొద్దుగూకిపోయింది నాలుగు మెతుకులు దిని ఏకోజావన పొండి,' అన్నది. వాళ్లు రొంసేపు ఏం మాట్లాడలా. ఆ తరవాత లేసి, 'సరేనమ్మ మేం జెప్పా ల్సింది చెప్పాం. చెప్పగలిగేవాళ్లమేగానీ చెయ్యా గలిగే టోళ్లం కాదుగదా,' అని ఎళిపొయినారు.

మా అమ్మా నాయన్లు అదే మాట మీద నిల బడ్డారు. రెండేళ్లు గడచిపొయినాయ్. అప్పుడప్పుడు ఎవరో పెద్దమనుషులు కదిలిచ్చేవోళ్లు, 'ఏదో ఒకటి ఆలోచించుకోవాల, ఆమన్నే ఉంటే ఎట్టా!' అని. మా నాయన తలకాయ ఊపేవోడు కానీ మాట్లాడేవోడు కాదు.

రెండేళ్లకి ముందు నాకు పెళ్లయ్యింది అనే మాట గుర్తు తెచ్చుకోవాలన్నా నాకు భయంగా ఉంటది. మా పక్కింట్లో ఉండే గుండ్రోళ్ల ఎంకట సుబ్బవ్వ వాళ్లింట్లో నేను మా ఆయనోళ్ల ఊరి నుంచివచ్చిన కొత్తల్లో పెయ్ దూడ ఒకటి పుట్టింది. తెల్లరంగులో ముద్దుగా వుండేదా... అందుకని అస్తమానూ దాంతో ఆడతా వుండే దాన్ని. అది చూసి సుబ్బవ్వ, 'అమేయ్ మహితా అంత ప్రీతిగా ఉంటే దాన్ని నువ్వే ఉండిచ్చుకోపోమే,' అన్నది. దానికి నేను సీత అని పేరు పెట్టా. మా సీత నా కళ్ల ముందరే పెరిగి పెద్దదై కట్టుకొచ్చింది. అబ్బ, కట్టు కొచ్చిన రోజు ఒక అరుపుగాదు. చుట్టుపక్కల ఎవర్న యినా నిలబడనిచ్చి నీళ్లు దాగనిచ్చిందా... దాని కోసం ఎద్దును తోలకొచ్చినారు. తోలక రావడానికి పొయ్యే టప్పుడు, 'మంచి ఎద్దుని చూడండి నాయనా,' అని మా నాయనకి చెప్పాలని నోటికాడ వరకు వచ్చిందిగానీ, మల్లా ఏవన్నా అనుకుంటారేమో అని చెప్పలేకపొయ్యా. ఎద్దు వొచ్చింది. నల్లబట్ట తెల్ల ఎద్దు. ఏ మాటకామాటే చెప్పొద్దా నాకా ఎద్దు అసలు నచ్చలా. కానీ అది రాంగా, రాంగానే మా సీతమ్మని చాలా గారాబం చేసింది. వొళ్లంతా నాలుకతో నిమిరింది. దగ్గర దగ్గరగా నిలబ డింది. ఎంతోసేపు బుజ్జగించింది. ఆ తరువాతే వాట్లికి పెళ్లైంది. నాకప్పుడు భలే ఆశ్చర్యమేసింది. మనం చీటికి మాటికి పశువులాగా మీదపడ్డాడు, ఎద్దు ముండా కొడుకు అంటామా... అది చాలా తప్పు! ఎప్పుడూ అట్ట మాట్లాడకూడదు. పశువులు చాలా మంచివి. ఆ ఎద్దుకి వుణ్ణి బుద్ధి మా ఆయనకి ఉండిందా. మా ఆయనకంటే నేను పద్నాలుగేళ్లు చిన్నదాన్ని కదా, నాదేం తప్పు? వాళ్లమ్మోళ్లు ఎవర్నో పెళ్లి చేసుకోనీ లేదని ఆ కోపమంతా నా మీద చూపిచ్చొచ్చా? అసలకి మనుషులే అసయ్యం అవునా? కాదా?

## 4

ఇంకొక నాలుగురోజులు పోతే సంక్రాంతి. ఏకో జామునే లేసి మా ఇంటి ముందర ముగ్గేసి రంగు లద్దతా ఉణ్ణా. మా ఊర్లో పండగనెల్లో మాత్రమే మంచు కురస్తది. రొంత రొంత మంచుగా మసగ్గా ఉణ్ణింది. అంతలోపల మా నాయన సెల్ ఫోన్ మోగింది. అమ్మా నాయన లేవలేదన్జెప్పి నేనే ఫోను తీసుకున్నానా, అవత ల్నుండి ఫోన్ చేసినోళ్లు మా మావ చచ్చిపొయ్యేడు రమ్మని చెప్పేరు. నేను అట్టే అని ఫోన్ పెట్టేసి ముగ్గే యడం మొదలుపెట్టా. ఇంతలోకి భోగికని తెచ్చిపెట్టు కున్న తాటాకుల్లోకి ఎక్కడ్నించి వచ్చిందో ఇంత పొడుగు పాము సరసరామని దూరింది. అంతే చేతిలో ఉన్న ముగ్గుగిన్నె ఆడ్నే పెట్టేసి పొయ్యి మా నాయన్ని నిదర లేపా. నాయనెనకాలే మా అమ్మ గూడా లేసొచ్చింది. కానీ ఎంత ఎతికినా పాము మళ్లీ కనపళ్లా.

నేను ముగ్గు పూర్తి చేసి, మా నాయన ముఖం గికం కడిగి కాఫీ తాగినాక నిదానంగా, 'నాయనా ఎంకు రెడ్డి సచ్చిపోయినాడంట,' అన్నా. మా నాయునకి మొదట (ఏ ఎంకురెడ్డో) గవనానికి రాలా, 'ఏ ఎంకురెడ్డి పాపా,' అన్నాడు. నాకు మా మావ అన్జెప్పడానికి మనసు రాలా. అందుకే, 'వాళ్లే నాయనా అరంపాలెపు ఎంకు రెడ్డి,' అన్నా. అప్పుడే మళ్ల ఫోనొచ్చింది. ఈసారి మా నాయన మాట్లాడేడు. మా అమ్మకి విషయం చెప్పేడు. మా అమ్మగూడ ఏం పట్టిచ్చుకోలా. కానీ తొమ్మిది లోపలే పదిసార్లు ఫోన్లొచ్చినాయ్. ఇంక ఆమన మా నాయన మా అమ్మని పిల్చి, 'సరే మే, ఒకసారి పాపని తీసుకపొయ్యి నీళ్లు చల్లిచ్చుకోనొద్దాం పద. అంతటితో అంటూగింటూ పోద్ది. సావుకాడ పగలెందుకులే పోయినోడెట్టా పోయె,' అన్నాడు. పదకొండుగంటల ట్రిప్పుకు ముగ్గురం బయల్దేరినాం. ఆ ఇల్లు, ఆ మొహాలు చూడడం నాకు ఒక్క రవంత కూడా ఇష్టమని పిచ్చలా. 'అంటు' కదా పొయిరా అని అందరూ చెప్తే సరేననిపిచ్చింది.

చావింట్లో అందరూ దిగిపొయ్యుండారు. ఇంటి ముందర ఎడంపక్క అరుగుమీద శవాన్ని పండబెట్టారు. మా ఆడపడుచులు వాళ్ల నాయన శవం చుట్టూరా కూలబడి బావురమని యాడస్తా ఉండారు. మా నాయన వస్తా వస్తా కొనక్కొచ్చిన పూలమాల నా చేతి కిచ్చి ఏసిరా పో నాయనా అన్నాడు. నాకు ఇష్టమని పిచ్చలా. నేను పోను నాయనా, నేనెయ్యను అన్నా. మా నాయనే పొయ్యి పూలమాల ఏసొచ్చేడు. మా ఆయన ఎక్కడా కనిపిచ్చలా. నేను ఆ తతంగాలంతా చూస్తా షామియానా కింద ఏసిన కుర్చీలో కూర్చున్నా. వాళ్ల ఏడుపుల్ని చూస్తా ఉణ్ణేనేగానీ, అదే అరుగుపైన ఇంకో రెండు వారాల్లో నేను శవమై పడుంటానని మా అమ్మ నాయన నా మీద పడి యాడస్తా ఉంటారని నాకు ఒక్క రొంత ఆలోచన కూడా కలగలా.

నేను శవమవడం ఏందని ఆశ్చర్యపడతా వుండారు గదా! నేను గూడా అట్టే ఆశ్చర్యపడ్డా. అదెట్ట జరిగిందో చెప్తా.

చిన్నదినం, నీళ్లు జల్లడం ఇట్ట ఏమేమో తతం గాలు ఉంటాయి గదా అయ్యన్నీ అయిపోయిన తర్వాత చానామంది ఎక్కడోళ్లు అక్కడ ఎళ్లిపోయినారు. దగ్గర బంధువులే కొంతమంది ఉణ్ణేరు. మా ఆడ పడుచులు మా అమ్మని నాయన్ని పట్టుకోని ఒకటే ఏడుపు. మా నాయనసలే మెత్తటోడా...! రొంసేపటికి వాళ్లు చెప్పే అన్నిటికీ ఊ కొట్టడం మొదలుపెట్టేడు. మా పెద్దాడపడుచు నన్ను దగ్గర కూచోబెట్టుకోని నా జుట్టు నిమరతా జడ చూస్తా, 'మా మహితమ్మ జడ ఎంత పెద్దదో కోడల్నెప్పుడిస్తావ్ మహితమ్మ నాకు,' అంటా ఉణ్ణింది. నడిపి ఆడపడుచు మా నాయన్తో, 'అయిందేదో అయింది మావా, ఈసారి అట్ట జర క్కుండా మేం జూస్తాం అమ్మిని ఈడే ఉండిచ్చండి, వాడి కత మేం జూసుకుంటాం, జరిగిపోయినయ్యి మనసు లో పెటుకోబాకండి. ఈడ మాత్రం ఇంకెవరుండారు, మా అమ్మొక్కటే ఐపాయా... వాడు యాపారం మీద బయటికిపోతే ఏ యాళకి వస్తాడో తెలీకపాయె, ఈసారికి జూడు మావ,' అని ఒకటే కాళ్ల బేరం జేసినారు.

మా నాయన చూసి చూసి మా అమ్మ పక్క తిరిగి, 'ఏమంటావు మే అమర?' అన్నాడు. మా అమ్మ, 'నేననేదేముంది నువ్వేదంటే అదేగదా,' అనింది. మా నాయన, 'ఏం నాయనా మహితా ఉంటావా అమ్మా,' అన్నాడు. నేనేం మాట్లాడలా. మా నాయనే మల్లా, 'అక్కోళ్లు అందరూ ఉండారు గదమ్మ ఇంకో పదేను రోజులు చూడు, నీకంతగా ఉండలేననిపిస్తే వచ్చేద్దువు గాన్లే. నా ఫోను గూడా నువ్వే పెట్టుకో అమ్మ, ఏ కష్ట మొచ్చినా చిన్నాయనకి ఫోన్ జెయ్యి నిమిషంలో లగెత్తుకొచ్చేస్తాం,' అన్నాడు.

అందుకు మా చిన్నాడపడుచు, 'ఈసారి అంత కష్టం రానీములే మావా,' అన్నది. నాకేం చెప్పాలో తోచలా. మనసులో చానా భయంగా ఉంది. మా అత్తకి తోడుకోసం ఈళ్లు నన్నుండమంటా ఉండారని అర్థమవ తానే ఉంది. అయినా నేను సరేసరే అని తలూపాను. ఎందుకంటే మా నాయనంటే నాకు ప్రాణం. మా నాయన మాటకి ఎదురాడ్డం నాకు ఇష్టముండదు. అందుకే, 'సరే నాయన అట్టేలే... ఉంటా,' అని చెప్పా. ఆ సందేళ మా నాయనోళ్లు ఊరికెళ్లిపోయినారు. ఈ ఇల్లు చేల మధ్య ఊరికి ఆఖరాన ఉంటదని చెప్పా కదా. వాకిట్లో నిలబడి చూస్తే రోడ్డు ఆ పొడుగు వరకూ కనిపిస్తది. మా అమ్మోళ్లు బడి, వీధి చివర గుడి దాటి పొయ్యే వరకు ఆడే నిలబడి చూసి... చూసి ఎనక్కి తిరిగా. తిరిగీ తిరగకతలికే మా ఆయన కనిపిచ్చేడు. అప్పటికే నా కళ్ల నిండా ఉన్న నీళ్లు పటపటా చెంపల పైకి కారాయి. మా ఆయన అది చూసి తటాల్న, 'సచ్చింది నీ మొగుడు కాదు, మా యమ్మ మొగుడు. ఈడెవరు రాక్షసులు లేరులే నిన్ను ఇరసక తినడానికి,' అని ఎళ్లిపొయ్యేడు.

ఎట్టో కొన్ని రోజులు గడిసిపోయినాయి. ఇంటి నిండా మనుషులుండటాన నాకు మా ఆయనతో మాట్లాడాల్సిన పనిబడలేదు. కానీ చిన్నగా ఎవరిళ్లకి వాళ్లు ఎళిపోవడం మొదలుపెట్టేరు. నేను రోజూ ఇంటికి ఫోన్ జేసి ఈడ విషయాలన్నీ మా నాయనకి చెప్తా ఉండా. మా నాయన కూడా తేపకంటే ఫోన్ చేస్తా వుండాడు. అప్పట్జేల్లెళ్లు ఏమేం జెప్పేరో ఏమోగానీ మా ఆయన అప్పుడప్పుడు నాతో మామూలుగా అందర్లాగే మాట్లాడ్డం మొదలుపెట్టేడు. నాకేమనిపించిందంటే పాపం ఆయన మాత్రం ఏం చేస్తాడు, వాళ్లమ్మోళ్లది గదా తప్పు. ఆయనకెవరో ఇష్టమైతే నాతో ఎట్ట బాగుంటాడు అనుకున్నా. మళ్లీ అనిపిచ్చేది... కానీ నన్నెందుకు కొట్టాల అని! ఆ రోజుటికి ఇల్లు మొత్తం ఖాళీ అయిపోయింది.

చాన్రోజులకి ఆరోజు తలారా స్నానం చేసి అరుగు మీద కూచున్నా. పక్కనే చేను మీద నుంచి చల్లటి గాలీస్తా ఉంది. ఎండ వాలుగా పడి చేనంతా తళతళా మెరిసిపోతా ఉంది. మా ఊళ్లో కోతలు కూడా అయిపోయినాయి. వీళ్లు లేటుగా ఏసినట్టుంది. ఏదేదో ఆలోచిస్తా ఉంటే గేటు దగ్గర శబ్దమైంది చూద్దును కదా.. మా అమ్మ, తాత. పొద్దున ఫోన్ చేసినపుడు కూడా వస్తా వుండామని ఒక్క మాటా చెప్పలేదే అని ఆశ్చర్యపడ్డా. సంతోషమేసింది. 'ఏమ్మా ఏందిట్టా సడెన్‌గా,' అన్నా. మా అమ్మ, 'మీ నాయనకి కల్లోకొచ్చినావంట, చూసేసి రమ్మని ఒకటే పోరు సరేని ఇట్టొచ్చినాం,' అన్నది.

మా అమ్మ అరిసెలు, కజ్జికాయలు, మా ఊరి సముద్రపు ఎండుచేపలూ తెచ్చింది. ఆ ఎండుచేపలు చూసి, 'ఈనకి ఎండుచేపేసి వంకాయ కూరొండితే బాగా ఇష్టం మా,' అన్నాను. అదిని మా అమ్మ, 'ఏ నాయనా మహిలు బాగానే ఉంటా ఉండాడామ్మా'' అన్నది. నాకేం చెప్పాలో తోచలా. మొన్నొకరోజు అన్నం పెడతా వున్నానా, మా అత్త దొడ్లోకి పోయినట్టుంది, తింటా తింటా మా ఆయన, 'ఏమ్మే ఇంట్లో చేలకని దెచ్చిన ఇన్ని పురుగు మందులుండాయే ఏదోకటి మింగి సావగూడదా, మళ్లా వొచ్చినావే, నేనింకో పెళ్లి చేసుకోవాల,' అన్నాడు. అదిని నేను, చాల్తీ కంటా ఉండాడేమో అని నవ్వి, 'నేనుండగా రెండో పెళ్లెట్ట జేసుకుంటావు ఈ జన్మకది కుదరదులే,' అని ధైర్యం జేసి అనేసి కూరగిన్నె దీసుకుని వంటింట్లోకి ఎళిపోయా. ఆ మాటలన్నీ మా అమ్మకి జెప్పా. మా అమ్మ తలెత్తి, అటకల మీద పేర్చిపెట్టిన పురుగుల మందు డబ్బాలు జూసి, 'మహిలు ఏం మాట నాయనా వాడి మాట. ఇంక నువ్వీడ ఉండనే ఉండొద్దు పద,' అన్నది. నేను రొంతసేపు ఆలోచిచ్చి, 'కాదుమా! ఇప్పుడిప్పుడే రొంత మాట్లాడతా ఉండాడు కదా, చూస్తా, ఏమైనా మారతాడేమో! ఇప్పుడు వరకైతే కొట్టటం తిట్టటం ఏమీలేదు కదమా,' అన్నాను. మా అమ్మ, తాత చానా జాగర్తలు చెప్పి ఆ సాయంత్రం నాలుగుగంటలేళ ఎళ్లిపొయ్యేరు. ఈరోజు మా ఆయనొస్తాడు అని అత్త చెప్పింది. అందుకని నేను మా అమ్మ తెచ్చిన ఎండు చేపల్లో వంకాయేసి కూరొండా!

మా అమ్మ పొయిన రెండు గంటలకి మా ఆయనొచ్చాడు. రావడమే ధుమ ధుమలాడతా వొచ్చేడు. మా అత్తని బూతూ బొండూ తిట్టేడు. నాకు భయమేసింది. నేనేం తలదూర్చలా. సక్కాపోయి పడుకున్నా. ఒక రాత్రి కాడ గట్టిగా తన్నినట్టనిపిస్తే దడుసుకుని లేశా. చూస్తే ఎదురుగా మా ఆయన. ఈసారి నాకు కోపమొచ్చింది. 'ఎందుకు తంతావుండావు? మీరందరూ ఉండమని పీకులాడితేనే ఇక్కడుండా, రేపే ఎళిపోతా, కొట్టడం, గిట్టడం కుదరదు,' అని ధైర్యంగా అన్నా. మా ఆయనకి కోపం పెరిగిపోయింది. ఆమన్నే మీదపడి కుమ్మడం మొదలుపెట్టేడు. నేను, 'అత్తా... అత్తా...' అని అరవడం మొదలుపెట్టా. అంతే మా ఆయన దిండు తీసుకుని నా మొహం మీద పెట్టి అదమడం మొదలుపెట్టేడు. నేను కాళ్లతో తంతా, చేతుల్తో గిచ్చడం మొదలుపెట్టా. మా ఆయన ఎక్కి నా గుండెల మీద కూర్చున్నాడు. మోకాళ్లు నా చేతుల మీదేసి అదిమేశాడు. నాకూపిరాడ్డం లేదు. 'నాయనా..! నాయనా..!' అని అరద్దామనిపించింది. పక్కనే మా నాయనిచ్చిపోయిన సెల్‌ఫోనుంది. నాకు ఒళ్లంతా పగిలిపోబోతా ఉణ్ణెట్టు అనిపిస్తా ఉంది. గట్టిగా గింజుకున్నా... నా చేతికున్న గాజులు నేలకి తగిలి పటపటమని పగల్తా ఉండాయి. నా గజ్జెలు చాపకేసి రాసుకుని గలగలా శబ్దం చేస్తా ఉండాయి. లాస్టుకి మా ఆయనతో, 'నీకు దండం పెడతా, నన్నొదిలెయ్, నేనేం తప్పు చేశా, నేను మా ఊరికెళిపోతా... ఇంకసలు, ఈ పక్కే తిరిగి చూడనని,' చెప్పాలనిపిచ్చింది. దండం పెడదామంటే చేతుల మీద మా ఆయన. నాకు పూర్తిగా ఊపిరాడ్డం మానేసింది. ఏడుపొచ్చేసింది, మా ఊరు, కుంటి కాకి గుర్తొచ్చాయి. నా లోపలే నేను నాయనా..! నాయనా..! అని అరస్తా ఉండా. నాకర్థమైపోయింది, మా ఆయున నన్ను చంపేస్తా ఉండాడని. మనసులోనే అంటా ఉండా,

'నీకు దండం పెడతా నన్నొదిలెయ్. నేనేం తప్పు చేశాను. నాదేం తప్పుంది...?' అదిగో సరిగ్గా అప్పుడు పోయింది నా ప్రాణం.

నేను కదల్డం మానేయంగానే మా ఆయన నా మీద నుండి లేశాడు. ముక్కుదగ్గర ఏలుపెట్టి చూశాడు. లేసి నిలబడి నన్ను ఒక్క తన్ను తన్నాడు. ఇప్పుడు నేను తన్నినా ఏమనను, నేనిప్పుడు శవాన్ని. మా ఆయన రొవంతసేపు మంచం మీద కూచున్నాడు. ఏదో ఆలో చించి లేసిపొయ్యి అటక మీద ఎండ్రిన్ డబ్బా తెచ్చి రెండు బుగ్గలూ పట్టి నా నోరు తెరిచి ఎండ్రిన్ పోశాడు. ఆ తరువాత మా పడకటింట్లోకి పోయి పడుకున్నాడు. నేనక్కడే ఉండిపొయ్యా, మహితని! వొట్టి మహితని! నాకు ఏడుపొచ్చేసింది. భోరుమని ఏడుపొచ్చింది.

## 5

పొద్దున్నే సూర్యుడొచ్చాడు. పాపం సూర్యుడికి నేను బతికి ఉండానా, సచ్చి పొయ్యానా అని ఏం పని? అందుకే వచ్చేశాడు! కానీ ఏకోర్హుమునే లేసి వాకిటి నిండా వంకీల ముగ్గు ఎయడానికి నేనే లేను, నేనింక ఎప్పటికీ లేవలేను. నాకు మళ్లా ఏడుపొచ్చింది. నేనేం తప్పు చేశాను అని. మా ఆయన, అత్త ఏదో మాట్లాడు కున్నారు. మా అత్త గుండె బాదుకుంటా ఏడవటం మొదలుపెట్టింది. మా ఆయన కుర్చీ తీసుకుని ఆమెని కొట్టడానికి పొయ్యేడు. మా ఆడపడుచులకి ఫోన్లు పొయ్యాయి. వాళ్లు బిలబిలామని వొచ్చేరు. ఆరోజు పూచీ మాదన్నదే... ఆ ఆడపడుచు ప్రవీణమ్మ... ఆమె ఫోన్ తీసుకుని సరిగ్గా తమ్ముడు చెప్పినట్టే, 'నేను ప్రవీణమ్మని మాట్లాడతావుండా మావా, మహితమ్మకి ఫిట్సు జబ్బేమన్నా ఉందా ఏంది? నీళ్లు తెస్తా తెస్తా ఆమన్నే ఇరసక పడిపోయింది. నోట్లో నుండి ఒకటే నురగ. పాము కరిసిందో, ఫిట్సో అర్థంగావడం లేదు, మీరు బయల్దేరి వచ్చేయండి,' అన్నది. అవతల్నిండి మా నాయన ఏమన్నాడో ఏమో ఫోన్ పక్కన పెట్టేసి చెమటలు తుడ్చుకుంది. తరువాత అందరూ మాట్లాడు కుని మా మావని పండబెట్టిన అదే అరుగుపై నన్ను పండబెట్టారు. ఇప్పుడు మా మావలాగే నేనూ శవాన్ని. మహితని కాదు, వుట్టి శవాన్ని.

పదకొండు గంటలకి మా ఊరి నుండి బంధువు లందరూ దిగిపొయ్యారు. మా నాయన కారుకాడ్నించి పరిగెత్తతా వొచ్చేడు. రాంగానే నన్ను, నా శవాన్ని జూసి నా కాళ్ల దగ్గర కూలబడిపొయ్యి, 'నాయనా మహితా... మహితా... లెయ్యమ్మా, నా బంగారుతల్లి గదా లెయ్యమ్మా మనమీడ్నుంచి ఎళిపోదామమ్మ, ఇంకీళ్ల మొహమే చూడొద్దు, మహిలూ లెయ్ నాయనా, నాయనా సచ్చిపోబాకమ్మా, నా బంగారు తల్లీ, మహిలూ...' అని యాడవడం మొదలుపెట్టాడు. మా అమ్మ వచ్చి నా పక్కన పడిపోయింది. ఏడుపూ లేదు, ఏం లేదు, ఒకటే ఎర్రిచూపు. మా అత్తలు గుండెలు బాదుకుని యాడస్తా ఉండారు. నాకు మళ్లా ఏడుపొచ్చింది. 'నాయనా నేనేం చేసేది నాయనా, యాడవ బాకు నాయనా,' అని చెప్పాలనిపిచ్చింది.

మా మావలు, చిన్నాయన్లు ఇంకా ఊర్లో పెద్ద మనుషులు జరగాల్సిన తతంగం గురించి మాట్లాడు కుంటా ఉండారు. ఎవరో పోలీసులకి ఫోన్ చేశారు. పోలీసులు ఫోన్ జేసిన ప్రెతీ తడవా, 'ఇదిగో వస్తా వుండాం అదిగో వస్తా వుండాం'' అంటా ఉండారు. ఎవరెవరో ఎవరెవరికో ఫోన్లు చేసుకుంటా వుండారు.

చివరికి ఆ మూలుండే పెద్దమనుషులు మా నాయన్ని నా దగ్గర్నుండి లేపి అవతలకి తీసకపొయ్యి, 'ఏణు రెడ్డా! ఏడిసిన పాట పోయిన అమ్మిగాన తిరి గొస్తదా? మొగోడివి జరగాల్సింది చూడొద్దా,' అన్నారు. మా నాయన ఆ మాటిని, 'అనా! నేను మొగోడ్ని కాదనా, నేను మొగోడ్ని కాదు! నాకు నా బిడ్డ కావాలనా! నా బిడ్డ గావాల, నా బిడ్డని నాకు దెచ్చియన్న,' అని నేల మీద కూలబడ్డాడు. పెద్దమనిషి మా నాయన్ని లేపి కుర్చీలో కూచోబెట్టి, 'ఏణు రెడ్డా! చెప్పేదిను, కేసులు గీసులంటే పోయిన బిడ్డ తిరిగొస్తదా. మీరు పెట్టిన య్యంతా రాబట్టుకుందాం. రెండెకరాలమ్మి గదా బిడ్డ పెళ్లి జేస్నావు. ఆ రెండెకరాలకి ఇంకో రెండెకరాలు కలిపి కొనుక్కునేట్టు డబ్బులడగదాం, లేకపోతే కేసు పెడతా మని బెదిరిద్దాం,' అన్నాడు.

మా నాయన ఆ మాటినంగానే ఆమన్నే లేసి నిలబడి, 'అన్నా! అమ్మి పోయిందన్నా... ఆస్తి నేనేం చేసు కొనేదన్నా? బంగారుతల్లి గదంటన్నా పిల్ల. కాపరం జెయ్యాలని మేమనుకోలేదే! అదిగో ఆ తల్లి, 'మావా నాదీ పూచీ,' అని అంటే గదా, బిడ్డనీడ వదిలిపెట్టిపో యింది. అమ్మ ప్రవీణమ్మ తల్లీ! ఏవమ్మా ఆరోజు నాది మావా పూచీ అంటివే? ఇదేనా తల్లీ పూచీ!' అని యాడ వడం మొదలుపెట్టాడు.

పెద్దమనుషులు, 'ఏణయ్య! మేం చెప్పేది ఇను. ఆడదాని కంటే ఘోరంగా ఉండావే, కేసులు గీసులు అంటే ఏమొస్తది. అయిందేదో అయింది. మన డబ్బైనా మనం రాబట్టొద్దా,' అన్నారు. మా నాయన నిలబడి,

'అనా ఇదిగో చెప్తావుండా ఇను, కేసు పెట్టేది పెట్టేదే, ఆ నా కొడుకుని జైలుకి పంపిచ్చకపోతే నా పేరు ఏణు గోపాల్రెడ్డే కాదు,' అని నా దగ్గరికి వొచ్చేశాడు.

ఫోన్ చెయ్యంగా చెయ్యంగా మధ్యాన్నం మూడు న్నర గంటలకి పోలీసులొచ్చారు. అందర్నీ అట్టాఇట్టా జరగమని, ఆడోళ్లని నా శరీరం మీద ఏమైనా దెబ్బ లుండాయా చూడమన్నారు. ఇంట్లోకి పొయ్యి పగిలిన నా గాజుముక్కలు ఏరుకొచ్చుకున్నారు. ఏందేందో రాసుకుని ఎళిపోయినారు. నెమ్మదిగా సాయంత్రమ యింది. నన్ను పోస్టుమార్టంకి తీసుకుపోవడానికి మా మావలు ఇద్దరు ముగ్గురు, మా అమ్మ నాయన తప్ప మిగిల్న అందరూ యాడోళ్లు ఆడ ఎళ్లిపోయినారు. కారు డ్రైవరు నా శవాన్ని కార్లో పెట్టడానికి వీల్లేదు అన్నాడు. మా నాయన వాడ్ని చానాసేపు బతివిలాడినా ఇనిపిచ్చు కోలా. లాస్టుకి, 'సరే డిక్కీలో పెట్టండి,' అన్నాడు. మా నాయన నన్ను లేపి, 'అమ్మా బంగారుతల్లీ,' అని యాడస్తా డిక్కీలో పండబెట్నాడు. నేను బాగా పొడుగు పిల్లని. అందరూ వొయిసుకి మించి పొడుగు అనే వోళ్లు. మా అమ్మకి నా మీదెప్పుడైనా కోపమొస్తే, 'తాటి చెట్టు ఎదిగినట్టు ఎదిగినావు ఇంత పొడుగున, ఆ మాత్రం బుద్ధి లేదంటవే,' అనేది. తాటిచెట్టంత పొడుగు కదా నేను, అందుకని డిక్కీలో పట్టలా. నా కాళ్లూ చేతులూ వంచి, వంచి డిక్కీలో కూర్చి డిక్కీ ఏసేసినారు. ఇప్పుడు నేను మహితను కాదు, మహిత శవాన్ని, అందుకని డిక్కీలో కూడా వుండొచ్చు. ఊపిరాడ దనే భయం లేదు. మా ఆయన ఎప్పుడో నిన్న రాత్రే నా ఊపిరి తీసేశాడు కదా అందుకు. మా పెద్దమ్మ ఒకామె టౌన్‌లో వుండేది. హాస్పిటల్ ఎనక వీధుల్లో వాళ్ల ఇల్లు వుండేది. వాళ్లింటికి పోవాలంటే రోడ్లో బస్సు దిగి హాస్పిటల్ గుండా పోతే దగ్గర దారి తొందరగా ఎళిపో వచ్చు. అందుకని మా నాయన ఆ దార్లో తీసుక పొయ్యే వాడు. ఆ దార్లో పాడుపడినట్టు ఒక చిన్న బిల్డింగ్ వుండేది. ఒకసారి మా నాయన్ని, 'అదేంది నాయనా?' అనడిగితే అక్కడ శవాల్ని కోస్తారని దాన్ని మార్చురీ అంటారని చెప్పి, 'అదిప్పుడు వేరే బిల్డింగ్‌లోకి మారిం దిలే భయమేం లేదు,' అని చెప్పేడు. అయినా సరే ఆ బిల్డింగు వచ్చిందంటే నాకు భయమేసిపోయేది. ఆ పక్క తల తిప్పకుండా పోయేదాన్ని.

నన్ను మార్చురీకి తీసుకొచ్చేప్పటికి రాత్రి ఏడు న్నరయింది. మా ఆయన తరపనోళ్లు గూడా ఎవరో వొచ్చేరు. డాక్టర్లు ముగ్గురు నన్ను కోయడం మొదలు పెట్టారు. వాళ్లలో మగ డాక్టరు నా జడ, మొహము చూసి, 'ఎంత చిన్నపిల్లో, ఎంత పొడుగు జడో! పాపం ఆ జడ పెరిగినన్ని రోజులు కూడా పట్టలా సచ్చిపోవ డానికి,' అన్నాడు. మా ఆయన తరపోళ్లొచ్చి డాక్టరుతో ఏవో మంతనాలాడారు. డాక్టరు అదిని, 'ఏమయ్యా అంత పసిబిడ్డ, అన్యాయంగా చంపి పారేస్నారు, పొమ్మంటే పొయ్యి, ఎట్టో ఒకట్ట బతుక్కోకపోయిందా, ఇప్పుడు తప్పుడు రిపోర్టు రాసి మీ దగ్గర డబ్బు తీసు కుంటే జీసస్ నన్నెప్పటికీ క్షమించడు, పొండి అవతల బడా...!' అన్నాడు.

నన్నీసారి అంబులెన్సులో ఎక్కిచ్చేరు. నా శవాన్ని మా అత్తింటి నుండి తీసుకొచ్చేప్పుడు, వాళ్ల వైపు బంధువులంతా నానా రభసా చేసేరు. పెళ్లైన ఆడది సస్తే అత్తగారూర్లోనే తగలబెట్టాలంట. అమ్మగారింటికి తీసుకుపోగూడదంట. అరిష్టమంట. అదిని మా నాయన, 'మాకింతకంటే అరిష్టం ఇంకేముంటది తల్లా, ముత్తెమంటి బిడ్డని మీ యదానేశాం, చాలమ్మ, మా బిడ్డని మేం దీసుకోపోతా,'మని తెచ్చేశాడు. తీసుకురా కుంటే నేనా ఊర్లోనే తగలబడిపొయ్యేదాన్ని కదా!

మా ఊరికి రాంగానే మా బంధువులందరూ యాడస్తా ఎదురొచ్చినారు. నన్ను దీసుకుపొయ్యి మా అరుగు మీద పండేసినారు. గోడు గోడుమని ఒకళ్లని బట్టుకొని ఒకళ్లు యాడవడం మొదలుబెట్టేరు. నేను నిండా మార్చురీ కట్లతో ఉండా కదా అందుకని నాకు శవస్నానం జేయించకుండా పసుపుగుడ్డ, చీర మీదేసి నిండా పూలు బెట్టేరు.

పూలంటే నాకెంతిష్టమో తెలుసా. మా కరగాడల్లో పూసే ముళ్లగోరింట, నాగమల్లి పూలని కూడా వదిలే దాన్ని గాదు. కోసుకొచ్చి, చిక్కగా కట్టి జడలో పెట్టుకుని ఒకద్దం ఎనకాల ఇంకొకద్దం ముందర పెట్టుకుని చూసుకునేదాన్ని. లేకపోతే నా జడలో పూలు నాకు కని పిచ్చవు గదా. అట్ట చూసుకుంటా వుంటే మా అమ్మమ్మ నా బుగ్గను పొడిసి, 'ఏం షోకులే ముండా నీకు,' అని నవ్వేది. మా రెండో అత్త, 'ఒమేయ్ అంత పూల పిచ్చి వుంటే మొగుడు పుటక్కన జస్తాడంట,' అనేది ప్చ్! మా అత్తకి ఆ మాట గుర్తుందో లేదో, నా జడనిండా పూలు పెట్టి మా రెండో అత్త ఆ జడని పట్టుకుని ఓమని యాడవడం మొదలుపెట్టింది. ఆ తరవాత నన్ను పాడె మీద పండబెట్టి స్మశానానికి తీసుకుపొయ్యేరు. మా నాయనే కొరివి బెట్టేడు.

నేను ఇంట్లోనే పుట్నానంట. అనుకోకుండా పుసక్కన పుట్టేస్తే మొదట మా నాయనే నన్ను ఎత్తుకున్నాడంట, మా నాయన ఆ మాట ఎప్పుడూ జెప్పేవోడు. ఇప్పుడు మా నాయనే నాకు కొరివి పెట్టేసరికి నా గుండెంతా సంతోషంతో నిండిపోయింది. అందుకే నేను ఎటుమంటి చిడిముడి పెట్టకుండా సుబ్బరంగా కాలి బూడిదయ్యా.

నా ఎముకల్ని ఒక కుండలో పెట్టి తెచ్చుకుని మా ఇంటి నిమ్మచెట్టు మొదట్లో పాతాడు మా నాయన. మళ్లీ అందరూ అరిష్టం అరిష్టం అన్నారు. అయినా మా నాయన ఇన్లా. ఇప్పుడు మా నాయనకి పొద్దున్నే లేవగానే ఒకటే పని, నిమ్మచెట్టు కాడికొచ్చి ఆమన్నే ఆ మట్లో నా ఎముకలు పూడ్చిన దగ్గర కూర్చొని, 'ఏం నాయనా మహిలు నన్ను తిట్టుకుంటా ఉండావామ్మా, మా నాయనే గదా నన్ను ఎముకలు జేసింది అనుకుంటా ఉండావామా,' అని యాడవటం. మా నాయన కంటే మా అమ్మే మేలు, ఒకరొంత మనుషుల్లో పడ్డది. మా నాయన యాడవటం జూస్తే నాకు, 'యాడవద్దు నాయనా,' అని ఓదార్చాలనిపిస్తది.

మా ఆయన, అత్త జైల్లో పడ్డరోజు మాత్రం మా నాయన చానా సంతోషపడ్డాడు. నిమ్మ చెట్టు దగ్గర కూర్చోని చానాసేపు ఏడ్చి, 'అమ్మ మహిలు ఎంత డబ్బు ఖర్చయినా కేసు వదలనమ్మ. వాడు జైల్లోనే ఉండి పోయేట్టు జేస్తా,' అన్నాడు. మూడు నెలలు జైల్లో ఉండి బెయిలు మీద బైటకొచ్చేరు మా ఆయన, అత్త.

కేసు కోర్టులో నడస్తా ఉంది. మా నాయన రోజు రోజుకీ మంచానికి అంటకపొయ్యి లేవడంలేదు. బంధువులందరూ అట్టయితే ఎట్ట ఏణయ్య అని చెప్తా వుండారు. ఎవరేం చెప్పినా మా నాయన ఓమని ఏడ్చే వోడు. రోజంతా ఆమన్నే పొడుకో నుండేవాడా, కోర్టు వాయిదా రోజు మాత్రం లేసి కోర్టుకి పొయ్యేవాడు.

నేను సచ్చిపోయిన ఒకటిన్నర సంవత్సరం తరువాత సంగతి ఇది. పదిగంటలేళ మా అమ్మ కుంటి కాకికి అన్నం పెట్టి కడిగి దబ్బిళిచ్చిన దబర్లు ఇంట్లోకి తీసుకుపోతా ఉంది. నేను సచ్చిపోయిన తరువాత మా అమ్మకి కుంటికాకి మీద బాగా ప్రేమ పెరిగింది. యాడకన్న పోవాల్సొస్తే, 'ఒక రొంత మహితమ్మ కాకికి అన్నం పెట్టండి.' అన్జెప్పి పోతది. ఆ రోజు కాకి తింటా తింటా ఉండిందల్లా కా..కా.. మని అరస్తా గెంతతా నీళ్ల తొట్టి పక్కకి పోయింది. మా యమ్మ ఇంటిలోపల్నిండి తొంగి చూసింది. ఎవరన్నా వొచ్చేరా... ఎట్టా అని.

నిజమే ఎవరో వొచ్చేరు. ఒక పెద్దాయన, పురా మరిగ్గా నా ఈడు పిల్లే, అంటే సచ్చిపొయ్యే రోజు నా వొయిసు పజ్జెనిమిదేళ్ల నాలుగునెల్లు గదా అంతన మాట. మా అమ్మ బయటికొచ్చి, 'ఎవరమ్మ ఎవరు గావాలా?' అన్నది. ఆ పిల్ల, 'నేను నరేంద్రరెడ్డి భార్యనమ్మ.' అన్నది. మా అమ్మకి నోట మాట రాలా. ఉలుకూ పలుకూ లేకుండా నిలబడిపోయిన మా అమ్మని జూసి ఆ పెద్దాయన, 'ఎండనబడి వొచ్చినాం తల్లా ఒక చెంబుడు నీళ్లి నాయన దాహంగా వుంది,' అన్నాడు. మా అమ్మ యాపచెట్టు క్రింద మంచం వాల్చి లోపలికి బోయి నీళ్లు దెచ్చిచ్చింది. వచ్చినోళ్లు నీళ్లు దాగినారు.

తరవాత ఒకరొంత సేపటికి ఆ పెద్దాయన, 'అమ్మా, మీరెవరో నాకు దెలీదు. నేను ఈ అమ్మికి నాయన్ని. నరేంద్రరెడ్డికిచ్చి పెళ్లిజేసే వరకు మాకు కేసుల సంగతి తెలీదు తల్లీ. రొయ్యలు గుంటలు బెట్టి ఉండిందంతా కారనూక్కున్నాం. చేనూ డొంకా అప్పులోళ్ల పాలజేసి ఎదిగిన బిడ్డకి పెళ్లెట్ట జేద్దుంరా దేవుడా అనుకుంటా ఉంటే, నరేంద్రరెడ్డి అక్క, ఈ అమ్మి ఆడపడుచు ప్రవీణమ్మ ఉందే ఆ యమ్మ వొచ్చి అడిగింది, మా తమ్ముడి భార్య పాము కరిసి సచ్చిపోయింది. మీ కూతుర్ని ఇస్తారా, కట్నాలు గిట్నాలూ ఏమీ బళ్లా, పిల్ల బాగుంటే సాలు, అని. మా అమ్మిది మంచి అదృష్టం, కయ్య కాలవా ఉన్నోడు అని బిడ్డనిచ్చేవమ్మ. తరవాత సల్లంగా అన్నీ కానిచ్చుకోని కేసు సంగతి జెప్పి మీ కాళ్లు పట్టుకోమని జెప్పి అంపిచ్చినారు. అది నాయనా సంగతి. న్యాయం ధర్మం ఆ భగమంతుడు ఎట్టయినా చూస్తాడు. చూడకుండా పోడు కదమ్మా. కానీ నా బిడ్డ పైన కనికరం బెట్టి ఆ కేసు వొదులుకోండమ్మా,' అన్నాడు.

మా అమ్మ ఎలవరపోయింది. తేరుకుని వల వలా యాడస్తా, 'ఏవయ్యా పెద్దమనిషి ఇదిగో నీ కూతురుందే ముత్తెమాలా... అట్టే ఉండేది నా కూతురు. దాన్ని శవం జేసి పంపిచ్చినాడు. వాడ్నెట్ట వొదలిపెడతామయ్యా, ప్రసక్తే లేదు,' అన్నది.

అదిని ఆ పిల్ల, 'పెద్దమ్మ! మీ పెట్టుపోతలుగాక ఇంకో రెండెకరాలు గూడా కలిపి ఇస్తారంట ఆయన చెప్పమన్నాడు. మీ అమ్మినే అనుకోని దయజూడు పెద్దమ్మ,' అన్నది.

మా అమ్మ ఆ మాటలిని, 'పాపా, నా బిడ్డనన్నావు, నా బిడ్డే అనుకుంటా, వాడొక సైతాను. నేను బతికినన్ని

రోజులు నీ తిండికి, గుడ్డకి లోటు లేకుండా సాకతా. దా... వొచ్చి నా దగ్గరుండు. అంతే కేసు గురించి మాత్రం మాట్లాడబాక... ఇంకోమాట. సచ్చిపోవడానికి రెండున్నర సంవత్సరాల ముందే నా బిడ్డ ఇంటికొచ్చేసింది. కట్టు గుడ్డతో వచ్చిన బిడ్డని మళ్లీ అంపిచ్చలా మేం. దాని పట్టుచీరలు, నగలు ఆడే ఉండిపోయినాయి. వాళ్లీలా, మేమడగలా. ఆరోజు అడగనోళ్లం, ఈరోజు నువ్వొచ్చి డబ్బాశ జూపిస్తే వొప్పుకుంటామా? వొప్పుకునే వాళ్లమైతే, శవం తీకుండానే రావాల్సింది వొసూలు జేసుకునే వాళ్లం. ఇంక మీరు పోయిరాండమ్మ,' అని లేసి ఇంట్లో కొచ్చేసింది. నాకు ఆ పిల్లని జూస్తే జాలేసింది. పాపం ఆ పిల్లది మాత్రం తప్పేముంది అనిపిచ్చింది.

కేసు చానా రోజులు నడిసింది.

ఆ రోజు ఆఖరి తీర్పు అని మా నాయన అమ్మకి జెప్తా వున్నేడు. పొద్దుటి నుండి చానా ఇచారంగా ఉణ్ణేడు మా నాయన. నిమ్మచెట్టు కాడికి వొచ్చినాడు కానీ ఏమీ మాట్లాడలా. మా వకీలు పేరు ఆదిశేషా రెడ్డంట, 'అమరా వకీలు చానారోజుల నుండి మారి పోయినాడు మే. ఇంతకుముందు లాగా ధైర్యంగా మనం గెలస్తామని చెప్పటంలేదు. నాకెందుకో భయంగా ఉంది. నేను కోర్టుకు పోలేను మే,' అన్నాడు. మా అమ్మ అదంతా ఇని, 'సరేలే అయ్యా పోకపోతే పోయినావులే. తెలిసేదెట్టా తెలవదా. దిగులుపడబాక. ఈ లోకంలో తప్పిచ్చుకున్నా పై లోకమనేది ఒకటుంది. ఆడవరకూ ఎందుకు, ఇది కలియుగం. ఆ కాలంలో అప్పటిది ఎప్పుడో అయితే ఈ కాలంలో ఇప్పటిదిప్పుడే అంట. వాడికి మన కడుపుకోత పాపం తగలకుండా పోదు,' అన్నది. మా నాయన, 'ఏం దేవుడు లే మే, మొన్న కేసు గెలుస్తామా ఓడిపోతామా అని ఎంకయ్యసామి ముందర చీట్లు పెడితే ఓడిపోతామని వచ్చింది. మనమేం పాపం జేసామని వొకీలు కాడ్నించి దేవుడి వరకూ అందరికీ మనమంటే లోకువ,' అన్నాడు.

మా అమ్మేమీ మాట్లాడలా. రొంసేపు మెదలకుండా కూచ్చోని ఆపట లేచి పూలచెట్ల కాడికిపోయింది. నేను సచ్చిపోయిన తరవాత పటం కట్టిచ్చడానికి ఫొటోలు ఎతికేరు. పెళ్లి తరవాత నేను ఒక్క ఫొటో కూడా దిగలేదు. పెళ్లి ఫొటోలు చూడడం కూడా మా అమ్మోళ్లకి ఇష్టం లేదు. అందుకని పదో తరగతి పరీక్ష కోసం తీయించు కున్న పాస్‌పోర్ట్ ఫొటోనే పెద్దది చేయించిపెట్టారు. దాంట్లో యూనిఫారం రైకతో, రిబ్బన్‌తో ఎత్తికట్టిన రెండు జడలతో బాగుంటాను. ప్చ్! చదువుకోనుంటే పొయ్యుండేది. పదో తరగతి తరువాత నేను బతికింది రెండున్నరేళ్లే కదా. అందుకని ఆ ఫొటోకి పటం కట్టిచ్చుకున్నారు. మా అమ్మ, పూలు తీసుకొచ్చి నా పటానికి పెట్టి, పోయి పొడుకున్నది. ఆ రోజుటికింక పొయ్యి ఎలిగిచ్చే పనిలేదని దానర్థం.

మా నాయన గోడంచుగా, నిమ్మచెట్టు కాడ మంచం వాల్చుకుని, తుండుగుడ్డ తలకింద పెట్టుకుని, చెయ్యి కళ్ల మీద పెట్టుకుని పొడుకున్నాడు. కేసు ఏమవతదో మా నాయనకి అప్పటికే తెలిసిపోయినట్టుంది. అంతెందుకు ఏమవతదో పసిబిడ్డని నాక్కూడా తెలిసినట్టే అనిపిస్తా ఉంది.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 15/22 ఏప్రిల్ 2012*

